ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
గురువారం 27 జూన్ 2024



సెస్‌ను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్దాం 8
డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలి 8



స్థానిక ఎన్నికలు ఎప్పుడో?

- ఇప్పట్లో లేనట్లేనా?
- జూలై 4తో ముగియనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ పదవీకాలం
- ఇంకా మొదలుకాని కసరత్తు
- ప్రత్యేక అధికారుల పాలనకే అవకాశం
- గతంలో రెండు నెలల ముందే ఎన్నికలు
- ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పాలన

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే కనిపిస్తోంది. ఆశావహులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నా ఎన్నికల నిర్వహణకు మాత్రం ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టలేదు. ఇప్పటికే గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. అదే బాటలో జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (జడ్పీటీసీ), మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ)ల ఎన్నికలు కూడా గడువులోపు నిర్వహించే అవకాశాలు కనిపించడం లేదు. జడ్పీటీసీ, ఎంపీటీసీల పాలకవర్గాల గడువు జూలై 4వ తేదీతో ముగియనుంది. గతంలో 2019లో అప్పటి పాలకవర్గాల గడువు ఐదేళ్ల ముగియక ముందే రెండు నెలల ఉండనగా మే 15 వరకు ఎన్నికల ప్రక్రియను పూర్తి చేశారు. రెండు నెలల తరువాత బాధ్యతలు చేపట్టారు. ఈసారి సకాలంలో ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదు. ఎన్నికలు సకాలంలో నిర్వహించాలంటే ఇప్పటికే ఓటర్ల ముసాయిదా, పోలింగ్ బూత్‌ల ఎంపిక, అధికారులకు శిక్షణ వంటి ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. ఎన్నికల కమిషన్ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. 2019లో పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రిజర్వేషన్లు రెండు విడతలుగా ఉండే విధంగా నిర్ణయించింది. దీని ప్రకారం జిల్లాలో రిజర్వేషన్ల ప్రక్రియ పాత పద్ధతిలోనే ఉంటుందా? మార్పులు జరుగుతాయా? అనే అంశంపై కూడా చర్చ జరుగుతోంది.

• జిల్లాలో 12 జడ్పీటీసీ, 123 ఎంపీటీసీ స్థానాలు

జిల్లాలో 12 జడ్పీటసీ, 123 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. వీటి గడువు తొమ్మిది రోజుల్లో ముగియనుంది. ఇప్పటికే మండల పరిషత్ సమావేశాల్లో ఎంపీపీలు, ఎంపీటీసీలు సన్మాన కార్యక్రమాలు కూడా చేసుకున్నారు. 2019 ఎన్నికల్లో 12 జడ్పీటీసీ స్థానాల్లో 11 మంది బీఆర్ఎస్, ఒకరు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందారు. 123 ఎంపీటీసీ స్థానాల్లో బీఆర్ఎస్ 71, కాంగ్రెస్ 18, బీజేపీ 7, ఇతరులు 25 మంది గెలుపొందారు. ఈ సారి ప్రభుత్వం మారిపోవడంతో కాంగ్రెస్ అభ్యర్థులు ఎంతో ఉత్సాహం చూపుతున్నారు. ప్రస్తుతం జడ్పీ పాలకవర్గంలో బీఆర్ఎస్ కొనసాగుతోంది. మరోవైపు పట్టుకోసం కాంగ్రెస్ నాయకులు ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలు పెట్టారు. జిల్లాలో జడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులు బీఆర్ఎస్ నుంచి కొందరు కాంగ్రెస్‌లోకి చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉండడంతో ఎక్కువగా జడ్పీతోపాటు ఎంపీపీ స్థానాలు కైవసం చేసుకోవడానికి సిద్ధమయ్యారు.

• 255 గ్రామ పంచాయతీలు.. 2240 వార్డులు ఖాళీ

శాసనసభ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల తరువాత పంచాయతీ ఎన్నికలు వస్తాయని భావించారు. కానీ ప్రాదేశిక ఎన్నికల తరువాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహణ ఉంటుందని తెలుస్తోంది. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు, 2240 వార్డులు ఉన్నాయి. వీటికి సంబంధించి సర్పంచులు, వార్డు మెంబర్ల కాల పరిమితి ఫ్రిబ్రవరి 2తో ముగిసింది. ఆ రోజు నుంచి ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. గడిచిన గ్రామ పంచాయతీ పాలనలో ఆరు సర్పంచ్ స్థానాలు, 88 వార్డు సభ్యుల స్థానాలకు ఉప ఎన్నికలు లేకుండానే కాలం కరిగిపోయింది. దీంతోపాటు సర్పంచులు, సొంత డబ్బులతో పనులు చేయించి బిల్లుల కోసం అనేక ఇబ్బందులకు గురవుతున్న సందర్భాలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులే కాకుండా ఏకగ్రీవ పంచాయతీలకు రావాల్సిన ప్రోత్సాహం కూడా అందలేదు. జిల్లాలో 41 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. వీటికి ప్రోత్సాహం కింద రూ.4.10 కోట్లు రావాల్సి ఉంది. గతంలో ప్రోత్సాహం కింద రూ.7 లక్షలు అందజేస్తే దీనిని గత ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించింది. సిరిసిల్ల నియోజకవర్గంలో 18 ఏకగ్రీవ గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటికి అదనంగా ఎమ్మెల్యే నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే గ్రామ పంచాయతీలకు నిధులను సమకూర్చినా రూ.10 లక్షల ప్రోత్సాహం నిరాశ పర్చింది. జిల్లాలో ఏకగ్రీవ పంచాయతీల్లో బోయినపల్లి మండలంలో కోరెం, చందుర్తి మండలం దేవుని తండా, కట్టలింగంపేట, కొత్త పేట, ఇల్లంతకుంట మండలం చిక్కుడువానిపల్లె, గుండెపల్లి, కిష్టారావుపల్లి, పెద్దలింగాపూర్, రామోజీపేట, సోమారంపేట, గంభీరావుపేట మండలం లక్ష్మీపూర్, రాజుపేట, పొన్నాలపల్లి, కోనరావుపేట మండలం ఆజ్మీరా తండా, గోవిందరావుపేట తండా, జై సేవాలాల్ భూక్య తండా, జై సేవాలాల్ ఊరు తండా, కమ్మరిపేట తండా, ముస్తాబాద్ మండలంలో గన్నవానిపల్లె, రుద్రంగి మండలంలో అడ్డబోరు తండా, బడి తండా, చింతమాని తండా, డేగావత్ తండా, రూపులానాయక్ తండా, సర్పంచ్ తండా, వీరుని తండా, తంగళ్లపల్లి మండలం చింతల్‌ఠాణా, నర్సింహులపల్లె, వీర్నపల్లి మండలం మద్దిమల్ల తండా బాబాయి చెరువు తండా, భూక్య తండా, లాల్ సింగ్ తండా, శాంతినగర్, ఎర్రగడ్డతండా, వేములవాడ రూరల్ మండలం తుర్కాశినగర్, ఎల్లారెడ్డిపేట మండలంలో బుగ్గ రాజేశ్వర్ తండా, గుంటపల్లి చెరువు తండా, దేవుని గుట్ట తండా, అగ్రహారం, హరిదాస్‌నగర్, గ్రామ పంచాయతీలు పూర్తి పాలకవర్గంతో సహా ఏకగ్రీవమై ప్రోత్సాహానికి అర్హతగా నిలిచినా నిధులు మాత్రం అందలేదు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

సిరిసిల్ల క్రైం, జూన్ 26 : జిల్లాలో అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం జిల్లాలో 12 మంది ఇసుక అక్రమ రవాణాదారులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనుమతులు లేకుండా ఇసుక రవాణాకు పాల్పడే వాహనాలను గుర్తించి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీజ్ చేశామన్నారు. ముస్తాబద్, ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ల పరిధిలో 8 వాహనాలు గుర్తించి సీజ్ చేశామని, 12 మందిపై కేసులు నమోదయ్యాయని తెలిపారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై తరచూ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో ఈ ఏడాది అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న 163 మందిపై కేసులు నమోదు చేశామని, 161 వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. 14 కేసుల్లో 21 మందిని రిమాండ్ చేశామన్నారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు .ఇసుక రవాణాకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉన్న వ్యక్తులపై చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్


ఎల్లారెడ్డిపేట, జూన్ 26: ఇసుక అనుమతులు ఉండి లైసెన్స్ లేకుండా నడుపుతుండడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేశామని, డ్రైవర్ శశి కుమార్‌పై చర్యలు తీసుకుంటామని ఎస్సై రమాకాంత్ తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వేములవాడ టౌన్, జూన్ 26:వేములవాడ బార్ అసోసియేషన్ సభ్యులకు బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కరీంనగర్‌కు చెందిన ప్రైవేటు ఆస్పత్రి నిర్వాహకులు కోర్టు ఆవరణలో న్యాయవాదులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సభ్యులు న్యాయవాదులు పాల్గొన్నారు.

శరవేగంగా మున్సిపల్ పార్కు పనులు

- రూ.2 కోట్ల అంచనాతో నిర్మాణం- ఆకర్షణగా నిలవనున్న మ్యూజికల్ సిస్టం


రూపుదిద్దుకుంటున్న పార్క్

వేములవాడ టౌన్, జూన్ 26: వేములవాడ పట్టణంలో చేపట్టి మున్సిపల్ పార్కు పనులు శరవేగంగా సాగుతున్నాయి. పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పెంపొందించడానికి, పట్టణాన్ని పచ్చ దనంగా మార్చాలనే ఆలోచనతో మున్సిపల్ ఆధ్వర్యంలో వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ పార్కు ఏర్పాటుకు ముందుకొచ్చారు. వేములవాడ పట్టణంలో ఒక్క పార్కు కూడా అందు బాటులో లేకపోవడంతో మండల పరిషత్ ఆవరణలోని ఖాళీ స్థలంలో పార్క్ ఏర్పాటు చేసేందుకు మున్సి పల్ అధికారులు కలెక్టర్ ఆదేశాల మేరకు సిద్ధం చేశారు. మున్సిపల్ పార్కును పట్టణ ప్రజల ఆహ్లాదాన్ని పెంచేందుకు కొత్త తరహాలో ఏర్పాటు చేస్తున్నారు. సుమారుగా రూ.2 కోట్ల అంచనా వ్యయంతో పార్క్‌ను నిర్మాణానికి పనులు ప్రారంభించారు. శరవేగంగా పను లు చేస్తూ ఇప్పటి వరకు 80 శాతం పనులు పూర్తియ్యాయని మరో పక్షం రోజుల్లో పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

వినూత్న ఆకృతులు ఆకట్టుకునేలా..

వేములవాడ మండల పరిషత్‌లో ఆవరణలోని ఖాళీ స్థలంలో మేజర్ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నారు. నడక దారి, ఆర్నమెంట్‌పోల్స్, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వాటర్ ఫౌంటేన్ ఏర్పాటు, అర్బన్ సీటింగ్ కోసం వినూత్న రీతిలో కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు. పార్క్‌లో చిల్డ్రెన్స్ కోసం ప్రత్యేకంగా ఒక విభాగం ఏర్పాటు, ఆద్యంతం పట్టణ ప్రజలను ఆకట్టుకునేందుకు డైనోసర్, కప్పలు, పుట్టగొడుగులు, పార్క్ గేటు సిమెంట్ కట్టడాలను ఏర్పాటు స్తున్నారు. పార్క్ చుట్టూ ప్రహరీ నిర్మాణం మండల పరిషత్‌లో వాకర్స్ కోసం ఉన్న దారిని తాత్కాలికంగా పునురుద్ధరించి వాకర్స్‌కు అందుబాటులోకి తీసుకురావడం వంటి పనులను చకచక పూర్తి చేస్తున్నారు. ముఖ్యంగా పార్క్‌లోకి వచ్చే ప్రజలకు ప్రత్యేకమై అనుభూతిని కల్పించేందుకు మ్యూజిక్ సిస్టం ఏర్పాటు చేస్తున్నారు. వాకింగ్ ట్రాక్ చుట్టూ ఏర్పాటు చేసే సీతకోక చిలుకలతో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి.


వాకర్స్ కోసం ఏర్పాటు చేస్తున్న కట్టడాలు

త్వరలోనే పట్టణ ప్రజలకు అందుబాటులోకి

- అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

రూ. 2 కోట్ల అంచ‌ వ్యయంతో మున్సిపల్ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నాము. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పనులను శరవేగంగా చేపిస్తున్నాము. పట్టణ ప్రజలకు, చిన్నారులకు, వృద్ధులకు, వాకర్స్‌కు, క్రీడాకారులకు ఆహ్లాదాన్ని పంచే విధంగా పార్క్‌ను సిద్దం చేస్తున్నాము. మరో పక్షం రోజుల్లో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాం.



ఆహ్లాదకరమైన వాతావరణం

- మాధవి, మున్సిపల్ చైర్‌పర్సన్, వేములవాడ

వేములవాడ పట్టణంలో మేజర్‌గా పట్టణ ప్రజలకు అందుబాటులో పార్క్ లేదు. అందుబాటులో ఖాళీ స్థలం కలిగి ఉన్న మండల పరిషత్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించి ప్రతిపాదనలు పంపించాం. కలెక్టర్ పార్క్ పనులకు కృషి చేస్తున్నారు. పట్టణ ప్రజలను, చిన్నారులను ఆకట్టుకునేలా నిర్మిస్తున్నాం.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 26: పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపడుతున్న పలు అభివృద్ధి పనులపై బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. పంచాయతీరాజ్ శాఖ కింద మొదలు పెట్టిన రోడ్లు, ఇతర నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. అంతకుముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా జిల్లాలో మంజూరైన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ రాజ్ శాఖ ఈఈ సూర్య ప్రకాష్, డీఈలు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జూన్ 26: డ్రగ్స్ నిర్మూలన కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపునిచ్చారు. డ్రగ్స్ వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. మత్తు పదార్థాలను అరికట్టేందుకు ప్లకార్డులు ప్రదర్శించారు. పట్టణంలోని ప్రభుత్వ కళాశాల మైదానం నుంచి అంబేద్కర్ చౌరస్తా, నేతన్న చౌరస్తా, గాంధీ చౌక్ మీదుగా తిరిగి కళాశాల గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనకోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యమై డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించి భావితరాలకు మంచి భవిష్యత్ అందించాలని అన్నారు. యువత గంజాయి వంటి మత్తుపదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. సమాజంలో ప్రభుత్వం నిషేధించిన మాదక ద్రవ్యాలు సమూలంగా నిర్మూలించడలో యువత, ప్రజలు పోలీసు శాఖకు సహకరించడంలో కీలక పాత్ర పోషించాలన్నారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై తమ అమూల్యమైన భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. జీవితంలో ఉన్నత విజయాలను చేరుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలన్నారు. జిలాల్లో గంజాయి, డ్రగ్స్ నిర్ములనకు కళాశాలలో, పాఠశాలలో విద్యార్థులతో యాంటీ డ్రగ్స్ క్లబ్‌లను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ర్యాలీకి వచ్చిన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐలు రఘుపతి, మాధుకర్, ప్రవీణ్ కుమార్, ఆర్.ఐ యాదగిరి, మాధుకర్, రమేష్, జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్, పోలీస్ సిబ్బంది, పలు పాఠశాలల, కళాశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


హాజరైన విద్యార్థులు

వర్షాలు కురవాలని గ్రామదేవతలకు బోనాలు

కోనరావుపేట, జూన్ 26 : వర్షాలు కురవాలని కోనరావుపేట మండలం మర్తనపేట గ్రామస్థులు బుధవారం గ్రామ దేవతలకు బోనాలు తీశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు. గ్రామ దేవతలకు బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు


పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

కోనరావుపేట జూన్26: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుం టామని వ్యవసాయ అధికారి వెంకటరామమ్మ అన్నారు. కోనరావుపేట మండలం నిమ్మపెల్లిలో బుధవారం ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. సేకరించిన విత్తనాలను ల్యాబ్‌కు పంపించి పరీక్షించనున్నట్లు చెప్పారు. నకిలీ విత్తనాలని తేలితే చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఈవో సహజ ఉన్నారు.

గ్రామాల్లోని దేవాలయాల అభివృద్ధికి కృషి


ప్రొసీడింగ్స్ అందజేస్తున్న జడ్పీటీసీ రవి

వేములవాడ టౌన్, జూన్ 26 : వేములవాడ మండలంలోని గ్రామాల్లో దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని జడ్పీటీసీ మ్యాకల రవి అన్నారు. వేములవాడ మండలం కొడుముంజ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయ ఆవరణలో వేసిన బోరుబావికి బుధవారం బోర్ మోటారు కోసం ప్రొసీడింగ్ అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ అర్బన్ మండలంలో అన్ని గ్రామాలు ముంపు గ్రామాలే ఉన్నాయని, నిర్వాసితులకు ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ దేవతల ఏర్పాటుకు సహకరించాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వాసితులకు ప్రాధాన్యం కల్పించిందని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ముంపు గ్రామాల్లోని దేవాలయాల్లో నెలకొన్న సమస్యలపై ముఖ్యంగా తాగునీరు కోసం బోరు బావులకు, మోటార్‌కు అర్జీలు పెట్టుకున్నవారికి న్యాయం చేశామన్నారు. అందులో భాగంగానే జడ్పీ నిధుల నుంచి మంజూరైన రూ.1.50 లక్షల ప్రొసీడింగ్‌ను అందజేస్తున్నామన్నారు. ఎంపీపీ బూర వజ్రవ్వబాబు, మాజీ సర్పంచ్ కదిరే రాజుకుమార్ గౌడ సంఘం నాయకులు బాలసాని దేవయ్య, పొన్నం అంజయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థినికి చెక్కు అందజేత

తంగళ్లపల్లి, జూన్ 26: తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని పీఎం శ్రీ తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల /కళాశాల విద్యార్థిని దాసరి మైత్రి ఇంటర్మీడియెట్ బైపీసీలో 989తో మార్కులతో రాష్ట్రంలో రెండో ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సెక్రెటరీ ప్రకటించిన రూ.15 వేల నగదు బహుమతిని చెక్కు రూపంలో ప్రిన్సిపల్ దర్శనాల పద్మ అందించారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అధ్యాపకులు అభినందించారు.

స్నేహితుడి కుటుంబానికి అండ

కోనరావుపేట, జూన్ 26 : చిన్ననాటి మిత్రుడు మృతి చెందడంతో బాధిత కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన దండు దేవరాజు అనారోగ్యంతో మృతి చెందాడు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబాన్ని ఆదుకోవడం కోసం 63,500 రూపాయలను స్నేహితుడి పిల్లల పేరిట ఫిక్స్ డిపాజిట్ చేశారు. బాండ్ పేపర్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు. పూర్వ విద్యార్థులు బెండ శ్రీనివాస్, నరేష్, కిరణ్, నాగరాజు తదితరులు ఉన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

కరీంనగర్ క్రైం, జూన్ 26 : కరీంనగర్ లోయర్ మానేర్ డ్యాం నీటి గుంతలో ఒక యువకుడు అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం చింతకుంటలోని గ్రీన్‌హోమ్స్‌లో నివాసం ఉంటున్న సామ శివారెడ్డి(26) మంగళవారం రాత్రి పద్మనగర్ ప్రాంతంలోని ఒక ప్రైవేట్ స్కూల్ వెనుక వైపున జలాశయంలోని పెద్ద నీటి గుంతలో పడి మృతి చెంది ఉన్నాడు. చింతకుంటలో తన తండ్రి నిర్వహిస్తున్న సర్వీసింగ్ సెంటర్‌లో ఉన్న శివారెడ్డిని మంగళవారం సాయంత్రం 5గంటల ప్రాంతంలో అతడి స్నేహితుడు నిశాంత్ బైక్‌పై తీసుకు పోయాడని, ఆ తరువాత 8 గంటల ప్రాంతంలో శివా రెడ్డికి తన తల్లి ఫోన్ చేయగా అరగంటలో వస్తున్నట్లు తెలిపాడని, మళ్లీ 9:15 గంటలకు ఫోన్ చేసినట్లు మృతుడి తండ్రి సత్యారెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కొద్దిసేపటి తరువాత మృతుడి సోదరుడు ఉదయ్‌రెడ్డికి నిశాంత్ అనే యువకుడు ఫోన్ చేసి శివారెడ్డి ప్రమాదవశాత్తు నీటి గుంతలో జారి పడి మృతి చెందాడని చెప్పినట్లు తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులంతా సంఘటనా స్థలానికి వెళ్లి అక్కడ ఉన్న శివారెడ్డి స్నేహితులను అడగగా సరైన సమాధానం ఇవ్వ లేదని, శివారెడ్డికి ఈతవచ్చని పేర్కొన్నారు. గతంలో నిశాంత్‌కు శివారెడ్డికి మధ్య డబ్బుల గొడవ ఉందని, తన కొడుకు మరణంపై అనుమానాలున్నాయని మృతుడి తండ్రి సత్యారెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడు శివారెడ్డి హైదరాబాద్‌లో ఒక కృత్రిమ అవయవాల తయారీ సంస్థలో పనిచేస్తున్నాడని, రెండు రోజుల కిందటే చింతకుంటకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. శివారెడ్డితో పాటు సంఘటన స్థలంలో ఉన్న అతడి స్నేహితులు ముగ్గురు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.



బీఫార్మసీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూన్ 26: శాతవాహన విశ్వవిద్యాలయంలో మేలో నిర్వహించిన బీఫార్మసీ (సీబీసీఎస్) 3,4,5,6, సెమిస్టర్ల ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. పరీక్షల ఫలితాలు శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో 12 మంది విద్యార్థులు డీబార్

గణేశ్‌నగర్, జూన్ 26: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ, రెండో, నాలుగవ, సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం 12మంది విద్యార్థులు డీబార్ అయినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. స్వామి వివేకానంద డిగ్రీ కళాశాల ధర్మారంలో ముగ్గురు, ప్రభుత్వం డిగ్రీ కళాశాల, కోరుట్లలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుజూరాబాద్‌లో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెట్‌పల్లిలో ఒకరు, ప్రభుత్వం డిగ్రీ కళాశాల మహదేవపూర్‌లో ఆరుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు తెలిపారు.

ఎలక్ట్రానిక్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్

రూ. 3 లక్షల సామగ్రి దగ్ధం

కోరుట్ల, జూన్ 26 : పట్టణంలోని గాంధీ రోడ్డులోని ఎలక్ట్రానిక్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం అయినట్లు దుకాణం యజమాని ఎడ్డెలి సత్యనారాయణ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం షాపులో ఉన్న సామగ్రి నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు తెలిపారు. స్థానికులు గమనించి మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పిందన్నారు. సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు యజమాని సత్యనారాయణ తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

సుభాష్‌నగర్, జూన్ 26: గన్నేరువరం మండలం పచ్చునూర్ గ్రామానికి చెందిన వడ్లకొండ వీరయ్య బుధవారం ఉదయం తాటి చెట్టు ఎక్కి కాలుజారి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని వెంటనే కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తర లించి మెరుగైన చికిత్స కోసం చల్మెడ ఆనందరావు ఆసుపత్రిలో చేర్పించారు. వీర య్యను సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కోడూరి పరశురాంగౌడ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్యగౌడ్‌లు పరామర్శించారు.

నకిలీ వీసాతో మోసం

● పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు
● కేసు నమోదు చేసిన పోలీసులు

మల్యాల, జూన్ 26: నకిలీ వీసాతో మోసం చేసిన హైదరాబాద్‌కు చెందిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు మల్యాల ఎస్సై-2 కుమారస్వామి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల మండలం తక్కళ్లపల్లికి చెందిన జుట్టు శ్రీకాంత్‌ను ఉద్యోగం కోసం పోలండ్ పంపిస్తామని హైదరాబాద్‌కు చెందిన మావిల్లపల్లి అభిలాస్‌రెడ్డి అనే వ్యక్తి రూ.3లక్షలు తీసుకున్నాడు. అక్కడ ప్రస్తుతం ఉద్యోగాలు లేవని ఫ్రాన్స్ పంపిస్తానని చెప్పి నకిలీ వీసా అప్పగించి మరో రూ.50వేలు వసూలు చేశాడు. అయితే ఆ వీసాతో ఈ నెల 12న ముంబైలోని ఏయిర్‌పోర్టుకు వెళ్లగా అక్కడ ఇమ్మిగ్రేషన్ అధికారులు అది నకిలీ వీసా అని శ్రీకాంత్‌ను పోలీసులకు అప్పగించారు. దీంతో అతను ఇప్పుడు జైల్‌లో ఉండగా అభిలాష్‌రెడ్డిపై అతని తండ్రి లింగారెడ్డి మల్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అభిలాష్‌రెడ్డిపై ఇమ్మిగ్రేషన్ యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. శ్రీకాంత్‌తో పాటు మల్యాలకు చెందిన రఫీక్‌ఖాన్, ముదాం నాగరాజ్‌తో పాటు పలువురిని మోసం చేసినట్లు ఫిర్యాదులు ఉన్నాయని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

గుడంబా స్థావరాలపై పోలీసుల దాడులు



గుడంబా బట్టీని ధ్వంసం చేస్తున్న ఎస్ఐ సందీప్‌కుమార్, సిబ్బంది

రామగిరి, జూన్ 26: మండలంలోని బేగంపేట్ గ్రామశివారులోని కంచల చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన గుడంబా స్థావరాలపై ఎస్ఐ సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో 12వేల లీటర్ల బెల్లం పానకం, సామగ్రిని ధ్వంసం చేశారు. గుడంబా తయారు చేసి, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. హెడ్‌కానిస్టేబుల్ రాంబాబు, కానిస్టేబుల్స్ సదానందం, రవి తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడి రిమాండ్

మెట్‌పల్లి, జూన్, 26: ఓ యువతిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని రిమాండ్‌కు తరలించి నట్లు బుధవారం ఎస్సై చిరంజీవి తెలిపారు. కోరుట్ల పట్టణానికి చెందిన మహ్మద్ జుబేర్‌ఖాన్ ఓ యువతిపై అత్యాచారానికి పాల్పడినట్లు ఈ నెల 24న మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు అందినట్లు తెలిపారు. సీఐ నిరంజన్‌రెడ్డి విచారణ చేపట్టి జుబేర్‌ఖాన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

భార్య ఆత్మహత్యకు కారకుడైన వ్యక్తికి జైలు శిక్ష

కరీంనగర్ లీగల్, జూన్ 26: భర్త వేధింపులు భరించలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న కేసులో నిందితుడైన భర్త మాధవరావు సుమన్ (38)కు మూడు సంవత్సరాల జైలు శిక్ష, 2 వేల రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జ్ ఆర్ శ్రీలేఖ బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గుంటూరు జిల్లా తెనాలి మర్సిపేటకు చెందిన మన్నవరాణిని అదే జిల్లా వేమురు మండలం వరాహపురంకు చెందిన మాధవరం సుమన్‌తో 2012లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. 2017లో బతుకుదెరువు కోసం గంగాధర మండలం గర్షకుర్తికి వచ్చి స్థిరపడ్డారు. కొద్ది రోజుల తర్వాత తాగుడుకు బానిసై భార్యను వేధించడంతో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ కేసులో సాక్షులను విచారించిన జడ్జి శ్రీలేఖ నిందితుడికి జైలు శిక్ష విధించారు.

వృద్ధుడి ఆత్మహత్య

పెగడపల్లి,జూన్ 26: పెగడపల్లి మండలంలోని కీచులాటపల్లి గ్రామానికి చెందిన మారుపాక లచ్చయ్య (70) అనే వృద్ధుడు బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. లచ్చయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంటి ఎదుట గల గుడిసెలో ఉరివేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



పెగడపల్లి, జూన్ 26: పెగడపల్లి మండలంలోని బతికెపల్లి శివారులో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన బలుసు గంగాధర్ (31), ముంజ రాజు అనే యువకులు ఇరువురు ద్విచక్ర వాహనంపై పెగడపల్లి నుంచి సుద్దపెల్లికి వెళ్తుండగా బతికెపల్లి గ్రామ శివారులోని సుద్దపల్లి లింగాపూర్ గ్రామాలకు వెళ్లే నాలుగు రోడ్ల కూడలిలలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయాల పాలైన ఇద్దరిని గ్రామస్థులు జగిత్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే బలుసు గంగాధర్ మృతి చెందినట్లు తెలిపారు. ముంజ రాజు పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ద్విచక్ర వాహనాన్ని టాటా ఏస్ ట్రక్ ఢీకొట్టినట్లు ప్రచారం జరుగుతోంది. సంఘటనా స్థలాన్ని ఎస్.ఐ రామకృష్ణ సందర్శించి, ప్రమాదానికి కారణమైన వాహన ఆచూకీ కోసం సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

భవనంపై నుంచి పడి..

కరీంనగర్ క్రైం, జూన్ 26: సుభాష్‌నగర్‌లో మంగళవారం రాత్రి భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి పులి సుమన్ కుమార్(40) మృతి చెందాడని మూడో ఠాణా పోలీసులు తెలిపారు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న సుమన్‌కుమార్ మంగళవారం సాయంత్రం భార్య, పిల్లలతో రేకుర్తిలోని బంధువుల ఇంటికి వెళ్లి రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చారు. ఇంటి ట్యాంక్‌లో నీరు లేకపోవటంతో మోటార్ ఆన్ చేసి, రెండో అంతస్థులోని ట్యాంక్ నిండిందో లేదో చూసి కిందకు దిగే క్రమంలో నీటి పాకురుతో ఉన్న చోట కాలు జారి కింద పడిపోయాడని మృతుడి తండ్రి రిటైర్డ్ ఎస్ఐ పులి నర్సింగం ఫిర్యాదు చేశారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రికి తరలించగా బుధవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జగిత్యాలలో పర్మిట్ రూం వద్ద మందుబాబుల వీరంగం

ఒకరిపై కత్తితో దాడి

జగిత్యాల టౌన్, జూన్ 26: జగిత్యాల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న ఓ వైన్స్ పర్మిట్ రూం వద్ద మందుబాబులు వీరంగం సృష్టించారు. పర్మిట్ రూం నిర్వహించే వ్యక్తిపై కూరగాయలు కోసే కత్తితో దాడి చేయగా స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న ఓ వైన్స్ పర్మిట్ రూంలోకి పట్టణానికి చెందిన శేఖర్, పుల్లయ్య అనే ఇద్దరు వెళ్లి మద్యం సేవించారు. పర్మిట్ రూంలో ఉన్న కొంత ఫుడ్‌ను తీసుకున్నారు. అతిగా మద్యం సేవించిన అనంతరం బయటకు వెలుతున్న శేఖర్‌ను పర్మిట్ రూం నిర్వాహకుడు బిల్లు చెల్లించాలని కోరగా శేఖర్‌తో పాటు పుల్లయ్య అనే ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. కౌంటర్‌పై ఉన్న కురగాయలు కోసే కత్తితో బెదిరించి దాడికి పాల్పడడంతో నిర్వాహకుడు రాకేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బైక్‌ల దొంగ అరెస్ట్

సిద్దిపేట క్రైం, జూన్ 26: సిద్దిపేట పట్టణంలో అంతర్ జిల్లా బైక్ దొంగను, అరెస్ట్ చేసి 19 బైకులను వన్ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి అనురాధ వెల్లడించారు. పట్టణంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో బుధవారం వన్ టౌన్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా నిజామాబాద్ జిల్లా మక్లూరు మండలం ధర్మారం గ్రామానికి చెందిన కుమ్మరి సాయి కుమార్ అనుమానాస్పదంగా కనపించాడన్నారు. అదుపులోకి తీసుకుని విచారించగా అతడు పలు జిల్లాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడినట్లు తేలిందన్నారు. అతడు కరీంనగర్ జిల్లా పరిధిలో మూడు, జగిత్యాల జిల్లా పరిధిలో ఒకటి, రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో ఒక బైక్ దొంగిలించాడని సీపీ తెలిపారు.

29 నుంచి హెచ్‌సీఏ ఉమెన్స్ లీగ్ ఓపెన్ సెలెక్షన్స్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 26: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే హెచ్‌సీఏ ఉమెన్స్ లీగ్ ఓపెన్ సెలక్షన్స్‌ను ఈనెల 29,30 తేదీల్లో నిర్వహించనున్నారని ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి.ఆగంరావు, మురళీధర్ రావులు తెలిపారు. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. పోటీల్లో పాల్గొనుటకు ఆసక్తిగల ఉమ్మడి జిల్లా మహిళా క్రీడాకారులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవలసి ఉంటుందని పేర్కొన్నారు. హెచ్‌సీఏ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని పూర్తి యూనిఫాం, క్రికెట్ కిట్ బ్యాగ్‌తో ఉప్పల్ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని వారు పేర్కొన్నారు.

గురుకుల అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి

» సర్కార్‌కు వారి బాధలు కనిపించట్లేదా?: హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలే పరమావధిగా నడుస్తున్న ప్రజా ప్రభుత్వానికి గురుకుల టీచర్ పోస్టుల అభ్యర్థుల బాధలు కనిపించకపోవడం బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంత్రులు, అధికారులను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. సీఎం ఇంటి ముందు మోకాళ్ల మీద నిలబడి అభ్యర్థించినా గురుకుల అభ్యర్థుల మొర ఆలకించకపోవడం శోచనీయమన్నారు. బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా గురుకుల అభ్యర్థుల నిరసనకు మద్దతు ప్రకటించారు. వారి సమస్యలను తక్షణం పరిష్కరించాలని బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోస్టులు బ్యాక్‌లాగ్ కాకుండా రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అన్నింటినీ భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీలో నెలకొన్న ఇబ్బందులను పరిష్కరించేందుకు జీవో46ను సవరించాలని బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. జీవో46కు సంబధించిన కేసు విచారణను అడ్వకేట్ జనరల్ ఉద్దేశపూర్వకంగా వాయిదా వేయించారని ఆరోపించారు.

కేసీఆర్ భూముల కోసమే అలైన్‌మెంట్ మార్చారు

» 'ఆర్ఆర్ఆర్' భూనిర్వాసితుల ఐక్య వేదిక

గజ్వేల్, జూన్ 26: తన భూముల విలువ పెంచుకునేందుకే మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్‌ను మార్చారని భూనిర్వాసితుల ఐక్య వేదిక నేతలు మండిపడ్డారు. ఈ అలైన్‌మెంట్‌ను మార్చాల్సిందేనంటూ వారు డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అనంతరం గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే తమ భూముల నుంచి కొండపోచమ్మ సాగర్ కాలువలు వెళ్లాయని వెళ్లాయని, ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్డు వెళ్తే.. ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు ఆర్డీవో ఎకరాకు రూ.7.50లక్షలు మాత్రమే ఇస్తామంటున్నారని, ఆ డబ్బుతో ఏం వస్తుందని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల ముందు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసినప్పుడు తమకు న్యాయం చేస్తామన్నారని, ఇప్పుడు టెండర్లను పిలుస్తున్నట్లు ప్రకటించడం సరికాదని ఆక్షేపించారు. ఇప్పటికే ఉన్న చిట్యాల-సంగారెడ్డి 161 జాతీయ రహదారినే రీజినల్ రింగ్ రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీకి షరతులు..వెన్నుపోటే: కిసాన్‌మోర్చా

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రారంభ, ముగింపు తేదీలు అంటూ షరతులు విధించడం.. రైతులకు వెన్నుపోటు పొడవడమేనని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2లక్షల రుణమాఫీపై తుక్కుగూడ సభలో రాహుల్ గాంధీతో హామీ ఇప్పించారని, దాన్ని అమలు చేయకపోతే ప్రజలే ఆ పార్టీ నేతల తుక్కు రేగ్గొడతారని హెచ్చరించారు. ఖరీఫ్‌లో పెట్టుబడికి డబ్బులు లేక రైతులు అల్లాడుతుంటే... అభిప్రాయ సేకరణ అంటూ ఆటలాడుతున్నారని మండిపడ్డారు. షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలని, లేదంటే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

పెన్షనర్ల సమస్యలపై ఉద్యమిస్తాం: జేఏసీ

సమస్యల పరిష్కారం కోసం జూలై నుంచి ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ వెల్లడించింది. ఈ మేరకు బుధవారం సీఎస్‌కు నోటీసు అందజేసినట్లు జేఏసీ చైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి శుభాకర్‌రావు తెలిపారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి అనేక సందర్భాల్లో వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ మేరకు జూలై 15న అన్ని జిల్లా కేంద్రాల్లో సమావేశాలు పెట్టి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తామని వెల్లడించారు. వేలాది మంది పెన్షనర్లతో జూలై 30న ఇందిరాపార్కు వద్ద మౌనదీక్ష చేస్తామని తెలిపారు.

అవినీతికి పాల్పడలేదని పొన్నం చెప్పగలరా?

» మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నాం

» బీఆర్ఎస్ మళ్లీ వచ్చాక ఎవర్నీ వదిలిపెట్టం: కౌశిక్‌రెడ్డి

బంజారాహిల్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ దేవుడిపై ప్రమాణం చేస్తారా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిలదీశారు. ఆయన ప్రమాణం చేస్తే క్షమాపణ చెప్పేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. ఫ్లై యాష్ తరలింపులో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.100 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని ఆరోపించిన కౌశిక్‌రెడ్డి.. జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయానికి వస్తే నిరూపిస్తానని సవాల్ విసిరారు. ఈ మేరకు బుధవారం టీటీడీ ఆలయానికి వచ్చిన కౌశిక్‌రెడ్డి.. అక్కడ మీడియాతో మాట్లాడారు. తన ఆరోపణలపై మంత్రి పొన్నం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. లీగల్ నోటీసులు పంపిస్తే భయపడేది లేదని స్పష్టం చేశారు. ఫ్లై యాష్ లారీలను తానే స్వయంగా హుజురాబాద్‌లో పట్టుకున్నానని, వే బ్రిడ్జికి తరలించి తూకం వేస్తే 76 టన్నులు పైగా తీసుకెళ్తున్నట్లు తేలిందన్నారు. నిబంధనల ప్రకారం 16 టైర్ల లారీలో 36 టన్నులు మాత్రమే తీసుకువెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వ్యవహారంలో రవాణా శాఖ మంత్రికి సంబంధం లేదా?అని ప్రశ్నించారు. మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నట్లు, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఎవరినీ వదిలేది లేదని హెచ్చరించారు.



ప్రధాని మోదీని కలిసిన బండారు దత్తాత్రేయ, కుటుంబ సభ్యులు

మోదీకి గవర్నర్ దత్తాత్రేయ అభినందనలు

న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీకి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందనలు తెలిపారు. బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీని దత్తాత్రేయ కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణభగవానుని 'విరాట్ స్వరూప్' విగ్రహాన్ని ప్రధానికి బహూకరించారు. గవర్నర్ సతీమణి బండారు వసంత, కుమార్తె బండారు విజయలక్ష్మి, అల్లుడు, డాక్టర్ బి.జిగ్నేష్ రెడ్డి, బండారు శివశంకర్, మనవరాళ్లు యశోధర రెడ్డి, వేదాంషి రెడ్డిలు మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. యశోధర, వేదాంషి ప్రధాని కోసం రెండు పాటలు పాడగా.. మోదీ వారిని ప్రత్యేకంగా అభినందించి, ఆశీర్వదించారు. మరోవైపు.. ప్రధానిమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి కలిశారు.

మేడిగడ్డ డిజైన్ ఒకటైతే..నిర్మాణం మరోరకంగా

» తుమ్మిడి హెట్టిని పునఃపరిశీలించాలి: కోదండరాం

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ ప్రాజెక్టు డిజైన్ ఒకటైతే నిర్మాణం మరోరకంగా చేశారని, అందుకే అది కుంగిందని టీజేఎస్ అధినేత కోదండరాం అన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యత లేదని, నిర్వహణ కూడా సరిగా లేదని ఆరోపించారు. ఈ విషయాలను డ్యామ్ సేఫ్టీ అధికారులే వెల్లడించారని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సుజల స్రవంతి పేరుతో కాంగ్రెస్ హయాంలో తుమ్మిడిహెట్టి వద్ద చేపట్టిన ప్రాజెక్టుకు సంబంధించి రూ.800కోట్ల ఖర్చుతో కాల్వల నిర్మాణం చేపట్టారని గుర్తుచేశారు. తుమ్మిడిహెట్టిని పునఃపరిశీలన చేసి కొంతమేరకు పనులు చేసినట్లయితే.. అప్పుడు చేపట్టిన కాల్వల ద్వారా నీటిని తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. మేడిగడ్డ తప్పిదానికి బాధ్యులపై చర్యలు తీసుకుని శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు కొనుగోళ్లకు సంబంధించి విచారణ కమిషన్ వేయాలని అడిగిందే బీఆర్ఎస్ వాళ్లన్నారు. ఇప్పుడు కమిషన్‌కు అర్హత లేదని చెప్పి.. వాస్తవాలు తెలియకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైల్‌రోకో కేసులో కేసీఆర్‌తో పాటు తానూ ఉన్నానని గుర్తు చేసిన కోదండరాం.. ఉద్యమకారులందరిపై కేసులు తొలగించాలని కోరాల్సింది పోయి.. ఆయనపైన ఉన్న కేసులే తొలగించాలనడం విడ్డూరమన్నారు.

స్పీకర్.. అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు



» మెయిల్, స్పీడ్ పోస్టులో ఫిర్యాదులు పంపాం

» పోచారం, సంజయ్‌ను అనర్హులుగా ప్రకటించాలి

» ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పడం సిగ్గుచేటు: జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ తరఫున గెలిచిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడం చట్ట వ్యతిరేకమని, వారిని అనర్హులుగా ప్రకటించాలని ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేద్దామంటే ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆ ఇద్దరిపై అనర్హత వేటువేయాలని కోరుతూ స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శికి వేర్వేరుగా ఈ మెయిల్, స్పీడ్ పోస్టు ద్వారా ఫిర్యాదులు పంపామన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారిద్దరిపై స్పీకర్ చర్యలు తీసుకోకుంటే న్యాయపరంగా ముందుకెళ్తామన్నారు. పాంచ్‌న్యాయ్‌లో ఫిరాయింపులను ఆమోదించబోమని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకుంటోందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో చట్టప్రకారం రెండు వంతుల మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరారని గుర్తు చేశారు. తమ పార్టీలో చేరిన వారంతా కేసీఆర్ వద్దకు వచ్చి కండువాలు కప్పుకొన్నారని, కానీ.. ఇప్పుడు రేవంత్ ఇంటింటికి తిరిగి కండువాలు కప్పడం సిగ్గుచేటన్నారు.

ఫిరాయింపులపై కేటీఆర్ మొసలి కన్నీరు

» త్వరలోనే బీఆర్ఎస్ నుంచి మరిన్ని చేరికలు: విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపులపైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మొసలి కన్నీరు కారుస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. గతంలో టీడీపీ నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను బీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రిని చేసినప్పుడు కేసీఆర్‌ను ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. 2019లో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఎటు పోయిందో కేటీఆర్ చెప్పాలన్నారు. సీఎల్పీ మీడియా హాల్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కేసీఆర్.. తన ఫామ్ హౌస్‌లో విద్కేలు పార్టీ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ మునుగుతున్న నావ అని, రేవంత్‌రెడ్డి అనే తుఫానులో ఆ పార్టీ కొట్టుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలను హీనాతి హీనంగా చూసిన చరిత్ర కేసీఆర్‌ది అని ధ్వజమెత్తారు. త్వరలోనే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మరిన్ని చేరికలుంటాయని స్పష్టం చేశారు. ఆ పార్టీలో మిగిలేది నలుగురేనన్నారు. కాగా, దివ్యాంగులకు ఉన్నత విద్యలో 5శాతం రిజర్వేషన్ కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి.. వారి ఆత్మబంధువుగా మారారని టీపీసీసీ దివ్యాంగుల సెల్ చైర్మన్ ముత్తినేని వీరయ్య కొనియాడారు.

మెట్టు దిగిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కాంగ్రెస్సే ముఖ్యమని వెల్లడి.. కేసీ వేణుగోపాల్, దీపాదాస్ మున్షీతో భేటీ

» ఫలించిన అధిష్ఠానం బుజ్జగింపులు

» కాంగ్రెస్‌తోనే జాతి ఐక్యత: జీవన్ రెడ్డి

» పార్టీలో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం: దీపాదాస్ మున్షీ



ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వీడడం ఖాయమన్న వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది. తనకు సమాచారం ఇవ్వకుండానే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని తీవ్ర మనస్తాపం చెందిన జీవన్‌రెడ్డి ఎట్టకేలకు మెట్టు దిగారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవాళ్ల అభిప్రాయాల ఆధారంగానే చేరికలు, ఇతర విషయాలలో ముందుకెళతామని అధిష్ఠానం హామీ ఇవ్వడంతో ఆయన శాంతించారు. రంగంలోకి దిగిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పరిస్థితిని చక్కబెట్టారు. మూడ్రోజులుగా అసంతృప్తితో రగిలిపోతూ పార్టీని వీడేందుకు సిద్ధపడిన జీవన్‌రెడ్డికి పార్టీ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. కేసీ వేణుగోపాల్ ఫోన్ చేసి ఢిల్లీ రావాలని కోరడంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి బుధవారం సాయంత్రం జీవన్ రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో జీవన్‌రెడ్డితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అరగంటపాటు చర్చలు జరిపారు. అయినా జీవన్‌రెడ్డి వెనక్కి తగ్గలేదు. ఆ తర్వాత ముగ్గురూ కలిసి కేసీ వేణుగోపాల్ ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వెళ్లినా తాను పార్టీని నమ్ముకుని ఉన్నానని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి చెప్పినట్లు తెలిసింది. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సంజయ్ చేరికపై అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం. జీవన్‌రెడ్డిని బుజ్జగించిన పెద్దలు.. పార్టీ అండగా ఉంటుందని, దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పుంజుకుంటున్న సమయంలో పార్టీని వీడవద్దని కోరినట్లు తెలిసింది. దీంతో చల్లబడిన జీవన్‌రెడ్డి సమ్మతించారు. భేటీ అనంతరం బయటికి వచ్చాక జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తనకు కాంగ్రెస్సే ముఖ్యమంటూ వెల్లడించారు. కార్యకర్తలను కాపాడుకోవడం ఏ పార్టీకైనా ముఖ్యమని అన్నారు. కార్యకర్తల ఆత్మగౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని, వారి ఆలోచనలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెరుగైన ఫలితాలు వచ్చాయని, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, జాతి ఐక్యతను కాంగ్రెస్ కాపాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ నెరవేరుస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో అమలుకాని పథకాలను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఏకకాలంలో రూ.31 వేల కోట్లతో రుణమాఫీకి కాంగ్రెస్ సంకల్పించడని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడటమా?: దుద్దిళ్ల

పార్టీలో సీనియర్ నేత అయిన జీవన్‌రెడ్డిని కించపరచడం తమ ఉద్దేశ్యం కాదని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే చేరికను అగౌరవంగా, అమర్యాదగా భావించి ఉండవచ్చన్నారు. పార్టీలో చేరికలకు తలుపులు తెరిచే ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌లో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం తగ్గకుండా చూస్తామని స్పష్టం చేశారు. ఏ నిర్ణయం తీసుకున్నా కేసీ వేణుగోపాల్‌తో చర్చించే తీసుకుంటామని చెప్పారు. మీడియా అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ.. టీపీసీసీ అధ్యక్ష పదవిపై నిర్ణయం అధిష్ఠానానిదేనని ఆమె పేర్కొన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతల విమర్శలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఫిరాయింపులపై ప్రశ్నించేందుకు ఆ పార్టీకి కాస్త అయినా నైతికత ఉండాలని మండిపడ్డారు. అధికారంలో ఉండగా కాంగ్రెస్‌ను అంతం చేయాలని ప్రయత్నించారన్నారు. ఇపుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మార్పు ఎలా ఉందో స్పష్టంగా కనపడుతోందని ఆయన పేర్కొన్నారు.

డ్రగ్స్‌కు బానిసైతే భవిష్యత్తు అంధకారం

» యువత వ్యసనాలు వీడి ఉన్నత లక్ష్యాలు చేరాలి: జూపల్లి

» మాదక ద్రవ్యాల మత్తులోనే లైంగిక దాడులు, హత్యలు: సీతక్క

మాదాపూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు బానిసైతే ఉజ్వల భవిష్యత్తు అంధకారమవుతుందని, యువత వ్యసనాలను వీడి లక్ష్యం వైపు అడుగులేసి ఉన్నత స్థాయికి చేరుకుని భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన 'డ్రగ్స్ నియంత్రణ.. అక్రమ రవాణాపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్కతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. మానవ జన్మ ఎంతో ఉత్తమమైనదని.. కానీ చెడు వ్యసనాల కారణంగా అనారోగ్యం పాలైన చాలామంది అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచానికి ఉగ్రవాదం తర్వాత అంతటి పెనుసవాలుగా డ్రగ్స్ వినియోగం మారిందన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు కూడా డ్రగ్స్ చేరడం ఆందోళన కలిగించే విషయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎంతో డ్రగ్ పెడ్లర్లతో పాటు వినియోగిస్తున్న వారినీ అదుపులోకి తీసుకుని కేసులు పెట్టామని వెల్లడించారు. సీతక్క మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల మాఫియా ప్రపంచాన్ని గడగడలాడించి, కోట్లు కొల్లగొడుతోందన్నారు. మాదకద్రవ్యాల మత్తులో లైంగిక దాడులు, హత్యలు చేస్తున్నారని, పెద్దపల్లిలో చిన్నారిపై లైంగికదాడి హత్య ఘటన మనసును కలవరపెట్టిందన్నారు. డ్రగ్స్ అనర్థాలపై మెగాస్టార్ చిరంజీవి సందేశంతో కూడిన వీడియో, పాటను మంత్రులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీజీపీ రవి గుప్తా, మాజీ క్రికెటర్ మిథాలీరాజ్, సినీ నటులు సుమన్, తేజా సజ్జా, గాయకుడు రామ్ మిరియాల, అధికారులు పాల్గొన్నారు.

ఐటీఐఆర్ మంజూరు చేసే వరకు మాట్లాడుతూనే ఉంటా

» కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను కలుస్తా

» ప్రతిపక్షంగా మా బాధ్యత మేము నిర్వహిస్తాం

» కాంగ్రెస్ ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు.. రఘునందన్ రావు బీఆర్ఎస్‌లో ఉన్నడు

» నాకష్టంతోనే నేను ఎదిగా: తూర్పు జగ్గారెడ్డి



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం హైదరాబాద్‌కు ఐటీఐఆర్‌ను మంజూరు చేసే వరకూ దానిపై మాట్లాడుతూనే ఉంటానని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి స్పష్టం చేశారు. పార్లమెంటు సమావేశాలు అయిపోయిన తర్వాత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం ఇస్తానని, రద్దయిన ఐటీఐఆర్‌ను తిరిగి తీసుకురావాలని కోరతానని వెల్లడించారు. ప్రతిపక్షం తరఫున తమ బాధ్యత నిర్వర్తిస్తామని వెల్లడించారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు కాంగ్రెస్‌కు వచ్చుంటే.. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యేందుకు అవకాశం ఉండేదేమోనన్నారు. అప్పుడు తామంతా రాహుల్ దగ్గర కూర్చుని హైదరాబాద్‌కు తిరిగి ఐటీఐఆర్‌ను మంజూరు చేయించుకుని ఉండేవాళ్లమని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సోనియా, మన్మోహన్‌సింగ్ ఇచ్చిన ఐటీఐఆర్‌ను మోదీ ప్రభుత్వం రద్దు చేయకుండా ఉంటే రాష్ట్రంలోని యువతకు ఈ పదేళ్లలో సుమారు 15లక్షల ఉద్యోగాలు వచ్చుండేవన్నారు. ఆ ప్రాజెక్టు అమలై ఉంటే సెజ్‌లు, ఇండస్ట్రియల్ పార్కులు, ట్రేడ్, వేర్ హౌస్ జోన్లు, ఎక్స్‌పోర్టు ఓరియెంటెడ్ యూనిట్లు హైదరాబాద్‌లో విస్తరించి ఉండేవని పేర్కొన్నారు. ప్రభుత్వానికీ పెద్ద ఎత్తున ఆదాయం సమకూరి ఉండేదన్నారు. ఇంత గొప్ప ప్రాజెక్టును ఎన్డీయే ప్రభుత్వం నిలిపేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన 8మంది బీజేపీ ఎంపీలు ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఐటీఐఆర్‌ను తిరిగి తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

నా కష్టంమీద నేను ఎదిగా

"ఐటీఐఆర్ గురించి నాకు అఆలు కూడా తెలియవని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అంటున్నారు. ఎడ్యుకేషన్‌పరంగా నేను వీక్ అయుండొచ్చు. ఇంటర్ ఫెయిల్ అయ్యాను కూడా. రఘునందన్‌రావు పుస్తకాలు చదివితే.. నేను జీవితాన్ని చదివిన. పుస్తకాల్లో ఎవరో రాసింది ఉంటది. మెరిట్ స్టూడెంట్‌కు అనుభవాలు ఉండవు. జీవితాన్ని చదివిన వాడికి కష్టాలు, అనుభవాలు ఉంటయి" అని జగ్గారెడ్డి అన్నారు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిండంటూ తనపై రఘునందన్‌రావు విమర్శలు చేస్తుండని, కానీ ఇక్కడ తల్లి పాత్రే తన దన్న సంగతి ఆయన తెలుసుకోవాలన్నారు. తన చిన్నతనంలో తమ దగ్గర ఆరెస్సెస్ శాఖలు నడుస్తుంటే.. పిల్లలమైన తాము గంట సేపు ఆడుకుని ప్రచారక్‌లు ఏదో చెబితే విని వస్తుండేవాళ్లమని చెప్పారు. రఘునందన్‌రావు బీజేపీలోకి డైరెక్టుగా వచ్చిండు కాబట్టి ఆ శాఖల గురించి ఆయనకు తెలియదన్నారు. ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు ఆయన బీఆర్ఎస్‌లోనే ఉన్నారన్నారు. తన కష్టం మీద, తన తల్లి ప్రోత్సాహంతో తాను ఎదిగానని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి జైలుకూ వెళ్లానన్నారు. తన జోలికి వస్తే బీజేపీలో ఉండే కుళ్లు, కుతంత్రాలు చర్చకు పెడతానని హెచ్చరించారు.

ప్రాణాలు తీస్తున్న మద్యం

» 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు

» ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మద్యం పానం ప్రజారోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో మరణాలకు కారణమవుతోంది. 'గ్లోబల్ స్టేటస్ రిపోర్టు ఆన్ ఆల్కాహాల్ అండ్ హెల్త్ అండ్ ట్రీట్మెంట్ ఆఫ్ సబ్‌స్టాన్స్ యూజ్ డిజార్డర్' పేరిట ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఇటీవల విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. మద్యం వినియోగానికి సంబంధించి 2019 నాటికి ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల నుంచి సేకరించిన గణాంకాల ఆధారంగా డబ్ల్యూహెచ్‌వో ఈ నివేదిక రూపొందించింది. దీని ప్రకారం 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా 40 కోట్ల మంది ఆల్కహాల్, మాదక ద్రవ్యాల వినియోగ రుగ్మతతో జీవిస్తున్నారు. వీరిలో 20.9కోట్ల మంది మందుబాబులు ఉన్నారు. మద్యపానం వల్ల కలిగే అనారోగ్యాల వల్ల 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు సంభవించాయి. మొత్తం మృతుల్లో 20 లక్షల మంది పురుషులే ఉండడం గమనార్హం. అంతేకాక, మరణించిన వారిలో 20-39 ఏళ్ల లోపు వారే అత్యధికంగా ఉన్నారు. భారత్ విషయానికొస్తే 2019 నాటికి దేశ జనాభాలో 31 శాతం మంది మద్యపానం చేసే వారున్నారు. దేశంలోని పురుషుల్లో 40.9 శాతం మంది, మహిళల్లో 20.8 శాతం మంది మద్యపానం చేసేవారున్నారు. మద్యపానం వల్ల మరణించిన వారి సంఖ్యలోనైతే భారత్ ఏకంగా చైనాను అధిగమించింది. భారత్‌లోని ప్రతీ లక్ష మంది జనాభాలో 38 మంది మద్యం వల్ల మరణిస్తే చైనాలో ఈ సంఖ్య కేవలం 16గా ఉంది. కాగా, మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ప్రపంచవ్యాప్తంగా 2.98 లక్షల మంది మృత్యువాత పడ్డారు. కాగా, 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా తలసరి మద్యం వినియోగం 5.5 లీటర్లు(ఏడాదికి ఒక వ్యక్తి తాగే మద్యం)గా ఉంది. భారత్‌లో ఇది 4.9 లీటర్లుగా ఉండగా 2030 నాటికి అది 6.7 లీటర్లకు చేరనుందని డబ్ల్యూహెచ్‌వో అంచనా వేసింది.

మహిపాల్‌రెడ్డి చూపు.. బీజేపీ వైపు?

కమలం గూటికి చేరనున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే?

» ఈడీ తనిఖీలతో ఆందోళనలో బీఆర్ఎస్ నేత?

» ఢిల్లీకి రహస్య టూర్



పటాన్‌చెరు, జూన్ 26: బీఆర్ఎస్‌కు మరో షాక్ తగలనుందా? పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బీజేపీలో చేరుతారా? ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జరిపిన తనిఖీల నేపథ్యంలో ఈ నిర్ణయానికి వచ్చారా? అంటే.. మహిపాల్‌రెడ్డి ఆకస్మికంగా ఢిల్లీ పర్యటనకు వెళ్లడంతో ఈ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం జహీరాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డి సమావేశం కావడం కూడా ఆయన బీజేపీ వైపు అడుగులు వేస్తున్నారన్న అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. అయితే గతంలో బీఆర్ఎస్ తరఫున రెండుసార్లు జహీరాబాద్ ఎంపీగా పనిచేసిన బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డికి సన్నిహిత సబంధాలున్నందున.. ఆ చనువుతో ఆయనను కలిశారనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కానీ, గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునంధన్ రావు పటాన్‌చెరు నియోజకవర్గంలో లక్ష పైచిలుకు ఓట్లు సాధించడంతో.. ఓటుబ్యాంకు బీజేపీ వైపు మళ్లిందన్న సంకేతాలు కనిపించాయి. బీఆర్ఎస్ ఏకంగా మూడో స్థానానికి పడిపోవడంతో తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటన్న ప్రశ్న స్థానిక బీఆర్ఎస్ నేతల మెదళ్లను తొలుస్తోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ఇదే ఫలితాలు వస్తే కేడర్ మిగలదన్న భావన వ్యక్తమవుతోంది. అయితే ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరిగినా.. ఈడీ సోదాల తరువాత పరిణామాలు వేగంగా మారిపోయాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలో తన ప్రధాన అనుచరులుగా చెప్పుకొనే వారికి సైతం చెప్పకుండా ఆయన ఢిల్లీకి వెళ్లారు. కేవలం కేసు పనిమీద న్యాయవాదులను కలిసేందుకు వెళ్లినట్లు ఆయన అనుచరులు చెబుతున్నా.. బీజేపీ నేత బీబీ పాటిల్‌తో మంతనాలకు సంబంధించి మాత్రం సమాధానం కరువైంది. అంతేకాకుండా బీజేపీ సంగారెడ్డి జిల్లా ముఖ్యనాయకుడు సైతం ఎమ్మెల్యే వెంట వెళ్లడం అనుమానాలు మరింత బలపడేలా చేస్తోంది.

కాంగ్రెస్ చేరేందుకు స్థానికంగా వ్యతిరేకత

మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరేందుకే ప్రయత్నాలు చేశారని, కానీ.. ఆయన ప్రయత్నాలను స్థానిక కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారని సమాచారం. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన నీలం మధు ముదిరాజ్.. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేరికను వ్యతిరేకించినట్లు తెలిసింది. మరోవైపు మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు ఇటీవల తనిఖీ చేసి పెద్ద ఎత్తున స్థిరాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, నగదును స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతోపాటు బినామీలుగా భావిస్తున్న కొందరిని ఈడీ కార్యాలయానికి పిలిపించి అక్రమాస్తులపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. కిష్టారెడ్డిపేట గ్రామానికి చెందిన ఓ బిల్డర్ మధుసూదన్‌రెడ్డికి బినామీగా వ్యవహరిస్తున్నట్లు ఆధారాలు లభ్యం కావడంతో ఆయన నుంచి వివరణ అడిగారు. మిగతా బినామీ వ్యక్తులు ఈడీ నుంచి తప్పించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారని తెలిసింది. ఎవరికి ఎప్పుడు ఈడీ నుంచి పిలుపు వస్తుందో, ఎవరి ఇళ్లలో సోదాలు చేస్తారోనన్న భయంతో వారు బిక్కుబిక్కుమంటున్నారు.

6 నెలల్లో అన్నీ తారుమారవుతాయి

(మొదటి పేజీ తరువాయి)

చూస్తున్నారన్న మాటలు కార్యకర్తల నుంచి వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో ఆయన కేసీఆర్‌ను కలవడంతో ఆ ఊహాగానాలకు తెరపడినట్టేనని కొందరు భావిస్తుండగా, మరికొందరు నాయకులు మాత్రం పార్టీ మారే అవకాశాలను కొట్టిపారేయలేమని వాదిస్తున్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు కేసీఆర్‌ను కలిసి చర్చలు జరిపినప్పుడు మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ఉన్నట్లు సమాచారం. లక్ష్మారెడ్డి వెంట నియోజకవర్గ నాయకులు తరలివెళ్లారు. నాయకులందరూ కేసీఆర్‌తో ఫొటోలు దిగిన అనంతరం అక్కడే భోజనాలు చేశారు. ఆయనను కలిసిన వారిలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతామధు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు. వారితో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు దాదాపు ఐదు గంటల పాటు కేసీఆర్ ఫాంహౌస్‌కు వచ్చిన కార్యకర్తలను కలిశారు.

కేటీఆర్‌ను కలిసిన నేతలు



కేటీఆర్‌తో నాయకులు

గంభీరావుపేట, జూన్ 26 : మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావును మండల బీఆర్ఎస్ నేతలు బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. మంచినీటి సమస్యతోపాటు పలు సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్లలో మంచినీటి సమస్యను శాశ్వతంగా నివారించే అంశాన్ని కేటీఆర్‌తో చర్చించారు.

కొండూరు రవీందర్‌రావును..

గంభీరావుపేట, జూన్ 26 : అమెరికాలో 24 రోజులపాటు జరిగిన అంతర్జాతీయ సదస్సుకు వెళ్లి వచ్చిన నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావును బుధవారం హైదరాబాద్‌లో గంభీరావుపేట బీఆర్ఎస్ నేతలు కలిశారు. బీఆర్ఎస్ మండలఅధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, నాయకులు లక్ష్మన్, బాల్‌రెడ్డి, గంధ్యాడపు రాజు తదితరులు ఉన్నారు.

పదోన్నతి కల్పించాలి

ఎల్లారెడ్డిపేట, జూన్ 26: బీఎడ్ కల్గిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు పీఎస్ హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించి తమకు న్యాయం చేయాలని కోరుతూ ఉపాధ్యాయులు ఎల్లారెడ్డిపేట మండల వనరుల కేంద్రం అధికారులకు బుధవారం వినతి పత్రం అందించారు. ఉపాధ్యాయులు సుధీర్, సుధాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, అంజయ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ వీడిన నాయకులు రాజీనామా చేయాలి

ఇల్లంతకుంట, జూన్ 26: బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యేలుగా గెలిచిన నాయకులు పార్టీని వీడినందున వెంటనే పదవులకు రాజీనామా చేయాలని మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సలీం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ నమ్మి ఎమ్మెల్యే టికెట్లు ఇస్తే మోసం చేశారన్నారు. నాయకులకు నిజాయితీ ఉంటే పదవులకు రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలో బలం ఏమిటో తెలుసుకోవాలన్నారు.

మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన

గంభీరావుపేట, జూన్ 26 : గంభీరావుపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చెత్త వేయడంపై మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహం వద్ద చెత్త పేరుక పోయి ఉంటే సంబధిత అధికారుల ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ఉన్న చెత్తను మాల మహానాడు నాయకులు తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఎగదండి స్వామి, మండల అధ్యక్షుడు లక్కం బాబు, నాయకులు వెంకటరాజం, బాలయ్య, రామచంద్రం తదితరులు ఉన్నారు.

చొప్పదండి ఎమ్మెల్యేకు పరామర్శ

గంభీరావుపేట, జూన్ 26 : చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొండూరు గాంధీ బుధవారం పరామర్శించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి ఇటీవల ఆత్మహత్య చేసుకున్నారు. చొప్పదండి ఎమ్మెల్యే సత్యం ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

లారీ అసోసియేషన్ ఎన్నిక

గంభీరావుపేట, జూన్ 26 : గంభీరావుపేట మండల లారీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సయ్యద్ సాదిక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా పల్లపు నర్సింలు, ఉపాధ్యక్షుడిగా మూల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ వహీద్, కోశాదికారిగా పల్లపు నరేష్, కార్యదర్శులుగా చెల్ల వెంకటేష్, చెల్ల సతీష్, కార్యవర్గ సభ్యులుగా పల్లపు దేవయ్య, పల్లపు పెద్ద నర్సింలు, పల్లెపు నర్సింలును ఎన్నుకున్నారు.

12 మంది రిమాండ్

సిరిసిల్ల క్రైం, జూన్ 26: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన 12 మందిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం తెలిపారు. ముస్తాబాద్‌కు చెందిన పిట్టల సంతోష్, మందాడి రాజశేఖర్, తాల్ల శ్రీనివాస్ రెడ్డి, చెర్ల ఉపేందర్‌యాదవ్, సరుగు చంద్రం, చిట్టవేని ప్రశాంత్, ఇల్లంతకుంట మండలం వెంకట్రావుపేటకు చెందిన ఏంద్ర చందన్, జెట్టి స్వామి, పున్ని సంపత్, కుంటాల సాయి, న్యాత అశోక్, గొర్రె హరీష్ ఉన్నట్లు పేర్కొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో ఇద్దరి...

ఎల్లారెడ్డిపేట, జూన్ 26: జిల్లాల్లోని పలు గ్రామాల్లో బైక్‌లు, ఆలయాల్లో చోరీకి పాల్పడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలోని షేక్ మహబూబ్, బైక్‌లను కొనుగోలు చేసిన బొప్పాపూర్‌లోని యజమాని అన్నరాశి కిష్టయ్యను సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని స్థానిక ఎస్‌ఐ రమాకాంత్ బుధవారం వెల్లడించారు. వారి వద్ద నుంచి మూడు వాహనాలను స్వాధీన పర్చుకున్నామని పేర్కొన్నారు.

పొన్నంపై ఆరోపణలు చేస్తే ఊరుకోం

ముస్తాబాద్, జూన్ 26 : ఖబడ్దార్ పాడి కౌశిక్‌రెడ్డి.. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని ముస్తాబాద్ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకుడు గుండెల్లి శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. ముస్తాబాద్‌లో బుధవారం మాట్లాడారు. బడుగు బలహీన వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పొన్నం ప్రభాకర్‌పై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కేంద్ర పర్యావరణ శాఖ మార్గ దర్గదర్శకాల మేరకే ఫ్లైయాష్ తరలింపు జరుగుతుందన్నారు. సమాజంలో బడుగు బలహీన వర్గాలు ఎదుగుతుంటే బీఆర్ఎస్ నేతలు ఓర్వలేక కుట్రలు పన్నుతున్నారన్నారని మండిపడ్డారు. మంత్రి పొన్నంను విమర్శిస్తే ఉరకునేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు అరుట్ల మహేశ్‌రెడ్డి, ఎద్దండి మహేందర్, ఏదునూరి భాను, తాళ్ల విజయ్‌రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, జూన్ 26 : ఎల్లారెడ్డిపేట పట్టణ కేంద్రానికి చెందిన ముత్యాల ప్రభాకర్ రెడ్డి తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య బుధవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను ప్రభాకర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జెడ్పిటిసి చీటి లక్ష్మణ్ రావు, సింగిల్ విండో చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సుభాష్, కిషన్, నర్సింలు ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులు భర్తీ చేయాలి

కథలాపూర్, జూన్ 26 : మండలంలో కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని మండల అంగన్‌వాడీ టీచర్స్ మరియు హెల్పర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆయా పోస్టులు లేని చోట టీచర్లే ప్రైవేట్ వ్యక్తులకు వేతనం ఇస్తూ తాత్కాలికంగా ఆయాలను కొనసాగించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అదే విధంగా ప్రభుత్వం అమలు పరిచే అన్ని రకాల పథకాల కోసం అంగన్‌వాడీ టీచర్లను వినియోగించుకుంటున్నారన్నారు. పిల్లల సంరక్షణతో పాటు ఆటా, పాటలతో కూడిన విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. అదనపు పనులు చెప్పడం వల్ల మానసికంగా, ఆర్థికంగా ఎన్నో ఇబ్బందలకు గురవుతున్నామన్నారు. కేంద్రాల్లో టీచర్లు అందుబాటులో లేకపోవడం వల్ల పిల్లల సంఖ్య తగ్గిపోతోందన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు సునీత, ఉపాధ్యక్షురాలు ఎం వనిత, కార్యద ర్శి ప్రతిభ, సుజాత, లక్ష్మీ, స్వర్ణప్రభ ఉన్నారు.

కథలాపూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా సంజీవ్‌రెడ్డి

కథలాపూర్, జూన్ 26 : మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా పిడుగు సంజీవ్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎన్నిక నిర్వహించారు. సెక్రటరీగా ఎల్లాల ప్రతాప్‌రెడ్డి, కోశాధికారిగా గడ్డం శ్రీనివాస్ రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పాస్ట్ గవర్నర్ చిదురాల సురేశ్, డాక్టర్ దిలీప్‌రావు, ఏలిమి రాంనారాయణ, గుంటుక ప్రకాశ్, పోతని ప్రవీణ్, ఆడెపు మధు, ఆడెపు కమల తదితరులు ఉన్నారు.

పాఠశాలలో పనులు తనిఖీ చేసిన ఎంపీడీవో

కథలాపూర్, జూన్ 26: మండలంలోని కలికోట ప్రాథమికోన్నత పాఠశాలలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పనులను బుధవారం ఎంపీడీఓ శంకర్ తని ఖీ చేశారు. వంట గది నిర్మాణం, విద్యుద్దీకరణ, ఫ్యాన్లు, ట్యూబులైట్ల ఏర్పాటు వంటి పనుల ప్రగతిని స్థానిక హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని సూచించారు. మధ్యాహ్న భోజన నిర్వా హకులకు వంటగది లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆ పనులు వెం టనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, సీనియర్ మేట్ అంబటి రాధాకృష్ణ ఉన్నారు.

సెస్‌ను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్దాం

- సెస్ చైర్మన్ చిక్కాల రామారావు



మహాసభలో మాట్లాడుతున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

సిరిసిల్ల రూరల్, జూన్ 26: సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు పాలకవర్గం కృషి చేస్తోందని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపంలో బుధవారం సెస్ 50వ మహాసభ చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు సెస్ పరిధిలోని గ్రామాల నుంచి 500 మంది ప్రతినిధులు హాజరయ్యారు. అభివృద్ధి పనులతోపాటు బడ్జెట్, చేపట్టబోయే తీర్మానాలను ఎండీ శ్రీనివాసరెడ్డి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సెస్ 50వ మహాసభను తమ పాలకవర్గం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. దీనికి ఉద్యోగులు, వినియోగదారులు, ప్రతినిధులు సహకరించడంతోపాటు సెస్ పరిధిలో బకాయి ఉన్న రూ.130 కోట్లను రికవరీ చేసేందుకు సహకరించాలని చైర్మన్ చిక్కాల రామారావు కోరారు. 1970లో ప్రారంభించిన సంస్థ 53 ఏళ్ల పూర్తి చేసుకొని 54వ సంవత్సరంలోని అడుగు పెట్టిందన్నారు. ఈ ప్రాంతంలో 2001లో టెక్స్‌టైల్ పార్కును ప్రభుత్వం స్థాపించిందని ఆ పార్కులో ప్రత్యేక సబ్ స్టేషన్ ఏర్పాటు చేసి నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. అపెరల్ పార్కులో ప్రత్యేక సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసి విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. గృహ జ్యోతి పథకం కింద లక్షా 70 వేల 596 గృహ విద్యుత్ వినియోగదారుల్లో 87 వేల 703 మంది వినియోగదారులు అర్హులయ్యారన్నారు. అనంతరం వివిధ సమస్యలపై సెస్ ప్రతినిధులు మాట్లాడారు. ఇల్లంతకుంట మండలం గాలిపల్లికి చెందిన ప్రతినిధి నర్సింహారెడ్డి మాట్లాడుతూ సెస్ బడ్జెట్‌లో ఖర్చులు అధికంగా ఉన్నాయని, వాటిని తగ్గించుకొని సంస్థ మనుగడను కాపాడాలని కోరారు. తంగళ్లపల్లి మండలం తాడూరుకు చెందిన సత్యనారాయణ మాట్లాడుతూ సెస్ సంస్థ స్టోరేజ్‌కు ఉన్న మూడెకరాల స్థలాన్ని రైతుబజార్‌కు ఇచ్చారని, దాని కోసం ప్రభుత్వం ఇస్తానన్న ఐదెకరాలు ఇవ్వకపోవడంతో అద్దె భవనాల్లోనే స్టోర్ కొనసాగుతోందని అన్నారు. సెస్‌లో జరిగిన అగ్నిప్రమాదాన్ని పాలకవర్గం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. స్పందించిన చైర్మన్ గత పాలకవర్గం తీర్మానాలు ఇవ్వడంతోనే ఆ స్థలాన్ని రైతుబజార్‌కు కేటాయించారన్నారు. ప్రస్తుతం స్టోర్‌కు ఇస్తానన్న ఐదెకరాల భూమిని రెండవ బైపాస్ రోడ్డులో రోడ్డుకు ఆనుకొని ఇవ్వడంతోపాటు నిర్మాణాల కోసం రూ.10 కోట్లు ఇవ్వాలని, ప్రస్తుత ప్రభుత్వంతోపాటు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు ఇచ్చామన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఉన్న సెస్ కార్యాలయాన్ని పోలీస్‌లు సర్కిల్ కార్యాలయంగా ఉపయోగించుకుంటున్నారని దానికి కూడా స్థలాన్ని కేటాయించి భవనాలను నిర్మించాలని జిల్లా ఎస్పీని కోరినట్లు తెలిపారు. సెస్ కార్యాలయంలో దీపావళి పండుగ రోజు జరిగిన అగ్ని ప్రమాదం రోజు ఎవరు కూడా లేరని దానిపై సమగ్ర విచారణ జరపాలని జిల్లా ఎస్పీని పాలకవర్గం కోరిందని త్వరలోనే వచ్చే సమగ్ర నివేదిక ఆధారంగా పాలకవర్గం చర్చించి అగ్ని ప్రమాదానికి బాధ్యులను గుర్తించి సస్పెండ్ చేయడంతోపాటు ఉద్యోగంలో నుంచి తొలగిస్తామని అన్నారు. బోయినపల్లి మండలం నర్సింగాపూర్‌కు చెందిన సంపత్‌రావు మాట్లాడుతూ మహాసభకు రావాలంటూ ప్రతినిధులకు నోటీస్‌లను అందించడం అగౌరవ పర్చడమేనన్నారు. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఎక్కడ ఇస్తున్నారో చూపించాలన్నారు. సెస్‌లో జరుగుతున్న అవినీతిపై చైర్మన్ దృష్టికి తీసుకవెళ్లినా స్పందన లేకుండా పోయిందన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఇక నుంచి జరిగే సెస్ కార్యాక్రమాలకు ఆహ్వానపత్రాలను పంపిస్తామన్నారు. సెస్ పరిధిలో బకాయి ఉన్న రూ.135 కోట్లను వసూలు చేయడానికి సెస్ ఉద్యోగులపైనే బాధ్యత పెట్టి బకాయిలు వసూలు చేసుకోని జీతాలు తీసుకోవాలనే ఆంక్షలు విధించారన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా బిల్లుల వసూలుతోపాటు మండలాల వారీగా సమావేశాలను నిర్వహించలేకపోయామన్నారు. వేములవాడ రూరల్ మండలం నూకలమర్రికి చెందిన నారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ కరెంట్ మీటర్లు కాలిపోతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామ పంచాయతీలోని అదనపు మీటర్లను అందు బాటులో ఉంచాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి పథకం చాలామందికి అమలు కావడం లేదని దీనిపై స్పందించాలని అన్నారు. చైర్మన్ మాట్లాడుతూ హెల్పర్లను బదిలీలు చేయడంతో వారు తమ సమస్యలను పాలకవర్గానికి విన్నవించి పదోన్నతులు లేక, జీతాలు పెరగక పోవడంతో తాము పనిచేయడం ఇబ్బందిగా మారిందని చెప్పడంతో త్వరలోనే వారికి పదోన్నతులు కల్పించి బదిలీ చేస్తామన్నారు. వీర్నపల్లి మండలం లాల్‌సింగ్ తండాకు చెందిన భూక్య గుగులాల్, భూక్య మోహన్ మాట్లాడుతూ తండాలో ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయని, అడవి పదిర గ్రామం నుంచి నేరుగా లాల్ సింగ్ తండాకు లైన్లు వేయాలని కోరారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తండాల్లోనే విద్యుత్ చౌర్యం అధికంగా జరుగుతుందని తండాల్లోని ఏ ఇంట్లో కూడా కరెంట్ మీటరును ఏర్పాటు చేసుకోకుండానే అక్రమ కరెంట్‌ను వినియోగించడం వల్లనే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని అన్నారు. తండాల్లో విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు ప్రతినిధులు సహకరించాలన్నారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన శ్రీరాముల వెంకటేశం మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలోని మరమగ్గాల పరిశ్రమలో మూడు మీటర్లు ఉంటే సబ్సిడీ రెండుమీటర్లకే వర్తిస్తుందని సెస్ అధికారులు ప్రకటించడంతో అదనంగా ఉన్న మీటరును సెస్‌కు సరెండర్ చేస్తున్నారని మిగతా మీటర్లకు సబ్సిడీ వర్తింపజేయాలని కోరారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, డైరెక్టర్లు దార్నం లక్ష్మీనారాయణ, మల్లుగారి రవీందర్‌రెడ్డి, గౌరినేని నారాయణరావు, వరుస కృష్ణహరి, సందుపట్ల అంజిరెడ్డి, మాడుగుల మల్లేశం, పొన్నాల శ్రీనివాసరావు, ఆకుల గంగారాం, నామాల ఉమ, రేగులపాటి హరిచరణ్‌రావు, ఆకుల దేవరాజం, కొట్టెపల్లి సుధాకర్ పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్



మాట్లాడుతున్న ఏబీవీపీ కన్వీనర్ నాగరాజు

సిరిసిల్ల రూరల్, జూన్ 26 : ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన పాఠశాలల బంద్ సిరిసిల్లలో విజయవంతమైంది. సిరిసిల్ల పట్టణంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్కేం నాగరాజు ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణకు చట్టాన్ని తేవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రైవేటు పాఠశాలలో అధిక ఫీజుల దందాను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఖాళీగా ఉన్న డీఈవో, ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ లోపెల్లి రాజురావు, టౌన్ కార్యదర్శి శివసాయి, ఎలగందుట శ్రీనివాస్, కాసారపు నితిన్, గౌతమ్, వెంకటేష్, రంజిత్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఏబీవీపీ చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. మండలకేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్ పాటించగా ప్రభుత్వ పాఠశాలలను ఏబీవీపీ నాయకులు మూసివేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను ప్రభుత్వం నియంత్రించలేకపోతోందన్నారు. ఎంఈవో పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీచేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కూనబోయిన ప్రవీణ్, నాయకులు అబిలాష్, సాయి, అశోక్, పర్శరాం, మణిదీప్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలంలో బుధవారం ఏబీవీపీ బంద్ విజయవంతమైంది. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజలు దందా, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేకపోవడంపై మండిపడ్డారు. పలు గ్రామాల్లో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు మూసి ఉంచారు. ఈ బంద్‌లో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొండ్లే తిరుపతి, మండల కన్వీనర్ కార్తీక్, ఏబీవీపీ నాయకులు మహేందర్, నవీన్, రాజు తదితరులు ఉన్నారు.

కోనరావుపేట: ప్రైవేటు పాఠశాలలపై ప్రభుత్వ నియంత్రణ కొరవడిందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూజ్యం కార్తీక్ అన్నారు. బుధవారం ఏబీవీపీ ఇచ్చిన బంద్ కోనరావుపేట మండలంలో విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం తేవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు చేతన్, చందు, శ్రీహరి, విజయ్, గణేష్ తదితరులు ఉన్నారు.

చందుర్తి : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ ఇచ్చిన పిలుపుమేరకు చందుర్తి మండలంలో పాఠశాలల బంద్ విజయవంతమైందని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు రవితేజ బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మహేష్, అరుణ్, విగ్నేష్, కార్తీక్, అరవింద్, తరుణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన ఏబీవీపీ బంద్ బుధవారం విజయవంతం అయింది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకు రావాలని డిమాండ్ చేస్తు రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పలిపు మేరకు తలపెట్టిన బంద్ పాక్షికంగా విజయవంతంమైంది.

ఎల్లారెడ్డిపేట : ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దందాను అరికట్టడంలో, మౌలిక వసతుల కల్పనపై విఫలమైన ప్రభుత్వంకు నిరసనగా ఏబీవీపీ తలపెట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయిందని రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ అన్నారు. ప్రభుత్వం వెంటనే ఖాళీ ఉన్న డిఇఓ, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల సమస్యలపై మౌలిక వసతులు కల్పించాలని వినతి పత్రాలు అందించిన పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఫీజుల నియంత్రణ చట్టంను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా కో కన్వీనర్ పెండ్యాల శివ, నవీన్ రెడ్డి, తేజ, కిషన్, అభిరామ్ పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఇల్లంతకుంట, జూన్ 26: బీఈడీ చేసిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఎల్ఎఫ్ఎల్ ఉపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించాలని బుధవారం ఎంఈవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. మిగిలిన లెఫ్టోవర్ వెకెన్సీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ ఉపాధ్యాయులు తూముకుంట రాంలింగారెడ్డి, జయకృష్ణ, మధు, వెంకటేశం, సత్యనారాయణ, రాజయ్య, రవి, ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

వేములవాడరూరల్ : అర్హత కలిగిన బీఎడ్ ఎస్జీటీలకు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా, స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించాలని ఉపాధ్యాయులు బుధవారం వేములవాడ మండల విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు.ఉపాధ్యాయులు రవీందర్, చక్రపాణి, కృష్ణహరి, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, రాంగోపాల్, నరేష్, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి : బీఈడీ అర్హతతో సెకండరీ గ్రేడ్ టీచర్లుగా నియామకమైన ఉపాధ్యాయులను పక్కనపెట్టి డీఈడీ అర్హతతో నియామకమైన జూనియర్ ఉపాధ్యాయులను ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యా యులుగా పదోన్నతి కల్పించడాన్ని వ్యతిరేకిస్తున్నామని మండల ఉపాధ్యాయ సంఘం నాయకుడు తాటికొండ సంజీవ్ కుమార్ అన్నారు. బీఈడీ అర్హత కలిగిన సీనియర్ ఉపాధ్యాయులకు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించాలని కోరుతూ చందుర్తి మండల నోడల్ అధికారి వినయ్ కుమార్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయులు మహేష్, వంగ తిరుపతి గౌడ్, శ్రీధర్, శ్రీనివాస్ చారి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే అసెంబ్లీ ముట్టడి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 26: మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు అన్నారు. కలెక్టరేట్ ఎదుట బుధవారం సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాయమల్లు మాట్లాడుతూ గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతినిధులందరూ అధికారంలోకి వచ్చే ముందు మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచుతామని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలో వచ్చి ఆరు నెలలు గడిచినా ఇప్పటివరకు ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదన్నారు. వేతనాలు సరిగా ఇవ్వకుండా కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత శాఖ మంత్రులు స్పందించాలని, గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని అన్నారు. ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, ఇన్సూరెన్స్ సదుపాయాలు కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చలో హైదరాబాద్ చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గుర్రం అశోక్, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్, గురజాల శ్రీధర్, మున్సిపల్, గ్రామపంచాయతీ యూనియన్‌నాయకులు కాసారపు శంకర్, లింగంపల్లి కృష్ణవేణి, బుర్ర శ్రీనివాస్, సుల్తాన్ నర్సయ్య, దోబ్బల లచ్చయ్య వర్కోలు మల్లయ్య, అంజయ్య, శ్రీనివాస్, మహేష్, పద్మ, మమత, లక్ష్మీ, రాజయ్య తదితరులు పాల్గొన్నారు

నూతన కార్యవర్గం ఎన్నిక

వేములవాడరూరల్, జూన్ 26 : వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో పాల ఉత్పత్తిదారుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రేమాల కాశీరాం, 9 మంది డైరెక్టర్‌లను ఎన్నుకోగా వీరిని కాంగ్రెస్ పార్టీ రూరల్ మండల అధ్యక్షులు వకుళాభరణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని శాలువలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు పరుశరాములు, ఎంపిటిసి బొడ్డు శంకరవ్వ, నాయకులు ప్రవీణ్, సంపత్, రణదీర్, సంజీవ్, మల్లయ్య, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థికసాయం

వేములవాడ టౌన్, జూన్ 26 : వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లికి చెందిన దండు సమ్మయ్య అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో అనారోగ్య బారిన పడి బుధవారం మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో దహన సంస్కారాలకు డబ్బులు లేక సాయం కోసం ఎదురు చూశారు. విషయం తెలుసుకున్న మన చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రూ.13 వేలు అందజేశారు. గ్రామానికి చెందిన పలువురు బాధిత కుటుంబానికి కొంత డబ్బు అందజేశారు. మన చారిటబుల్ ట్రస్ట్ నిర్వహకుడు మోటూరి మధుసూదన్, స్థానిక కౌన్సిలర్ జడల లక్ష్మిశ్రీనివాస్, లాల దేవయ్య, కోమురవెళ్లి శివుడు తదితరులు ఉన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలి



వేములవాడలో అవగాహన కల్పిస్తున్న టౌన్ సీఐ

ఎల్లారెడ్డిపేట, జూన్ 26:డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలని, మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యతని సీఐ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినం సందర్భంగా విద్యార్థులతో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్ కోసం బాటలు వేసుకోవాలని పిలిపునిచ్చారు. ఎస్సై రమాకాంత్, ఏఎస్ఐ కిషన్ రావు, రచయిత వాసరవేణి పర్శరాం పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మత్తు పదార్థాలకు యువకులు బానిసలు కావద్దని ఎస్సై రాజుగౌడ్ సూచించారు. మండల కేంద్రంలో బుధవారం జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మత్తు పదార్థాలు జీవితాలను నాశనం చేస్తాయన్నారు. అనంతరం మత్తుపదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఏఎస్సై దేవేందర్‌రెడ్డి, హెచ్‌సీలు పాల్గొన్నారు.

గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంలో బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినం సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అవగాహన ర్యాలీలో ఎస్సై రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండల కేంద్రంలోని మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో పోలీసుల ఆధ్వర్యంలో 'మాదకద్రవ్యాల నిర్మూలన- యువత పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సుధాకర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలన దినం సందర్భంగా పోటీలు నిర్వహించినట్లు తెలి పారు. గురువారం బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.

రుద్రంగి : మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్సై అశోక్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఇందిరాచౌక్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

కోనరావుపేట : కోనరావుపేట మండల కేంద్రంలో కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం మాదక ద్రవ్యాలపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ, బస్టాండ్ ఆవరణలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు.

వేములవాడ టౌన్: యువత డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను చీకటిమయం చేసుకోవద్దని వేములవాడ టౌన్, రూరల్ సీఐలు వీర ప్రసాద్, శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినం సంద ర్భంగా తెలంగాణ చౌరస్తా నుంచి రాజన్న ఆలయం వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ పిల్లలపై తల్లిదండ్రులు దృష్టిసారించానల్నారు.

వీర్నపల్లి : గ్రామీణ ప్రాంత యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉడాలని ఎస్సై రమేష్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మంచి అలవాట్లను పెంచుకుని ఏకాగ్రతతో చదువుకుని ఉన్నత శిఖరాలకు అధి రోహించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాజిరెడ్డి, ప్రిన్సిపాల్ విశ్వనాథం, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చందుర్తి: యువత మాదకద్రవ్యాలకు అలవాటుపడితే బంగారు భవిష్యత్‌తోపాటు దేశ భవిష్యత్ నాశనమవుతుందని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా విద్యార్థులతో బుధవారం ర్యాలీ, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సరదా కోసం మాదకద్రవ్యాలు తీసుకుంటే నష్టం తప్పదని, ఇలాంటి సరదాలు వద్దని సూచించారు. ఎస్సై శ్రీకాంత్, ఏఎస్సై బాపు, జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాల, విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ప్రపంచ మాదక ద్రవ్యాల నిర్మలన దినం సందర్భంగా ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం యాంటీ డ్రగ్స్ ర్యాలీని నిర్వహించారు. పోలీసులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో నూతన బస్టాండ్ కూడలిలో ప్రతిజ్ఞ చేయించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ సదన్‌కుమార్, పీసీలు కుమార్, దామోదర్ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీస్ అధికారులు